


# జాలిలేని జాబిలి

## – కొమ్మూరి వేణుగోపాలరావు



తనకు కావలసింది వెదుక్కుంటూ ముందుకుపోవడమే మానవుని జీవితం. కాని తనకు కావలసిందేమిటోకూడా తెలియని అస్పష్టస్థితి.

రచయిత కావాలనుకున్నాడు - అయినాడు. డాక్టరు కావాలనుకున్నాడు - అయినాడు. పేరు ప్రఖ్యాతులు కావాలనుకున్నాడు - లభించినై.

కానీ అతనికి యేదో కావాలి. అతన్నెంతోమంది ఆరాధించారు. జీవితంలోకి ఎందరో సుందరీమణులు ప్రవేశించారు. అతని చుట్టూ ప్రేమ హృదయంలో ప్రేమ. కాని ఆ ప్రేమ అతన్ని స్పర్శించేదేగాని అదృష్టవంతుడ్ని చేయలేదు.

యవనం వుంది - డబ్బు వుంది - కీర్తి వుంది - అంతా వున్నారు కాని...?

అతనిపట్ల జాబిలికి జాలిలేదు.

### *కొమ్మూరి రవికిరణ్ గారి ప్రత్యేక అనుమతితో*
### *అలనాటి అందమైన నవల పునర్ముద్రణ*

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

**మరునాడు సాయంత్రం** ఏమీ తోచక తెలుగు సినిమాకు వెళ్ళాడు మధుబాబు. ఆ సినిమాలో హీరోయిన్ వేషం వేసిన ఆమెను చూడగానే షాక్ తిన్నట్లయింది. అతనికి బాగా సన్నిహితమైన వ్యక్తి ఎవరో. ఎవరా ఎవరా అని మతి పాడుచేసుకున్నాడు. బయటకు వచ్చి వాల్‌పోస్టర్ మీదవున్న పేరు చూశాడు. పరిచితమైనది కాదే. మళ్ళీ లోపలకు వచ్చి కూర్చున్నాడు. ఒహ్. రజని. అవును ఆమె రజని. తనూ, అక్కా బడినుంచి వస్తూంటే చిన్నప్పుడు పిలిచి బిస్కెట్లూ కాఫీ ఇచ్చి ఆప్యాయత ప్రదర్శించిన అందగత్తె. అక్కడనుంచి వెళ్ళిపోయాక ఆమె ఉనికి ఏమీ తెలియలేదు. క్రమంగా ఆమె గురించి

కూడా మరచిపోయాడు. ఇప్పుడు సినిమాలో చేరిందన్నమాట. ఈ రెండు మూడు సంవత్సరాలు ఎక్కడ వుందో, ఎట్లా గడిపిందో అతనికి హృదయం ఆర్ద్రమైంది. ముగ్ధుడయి చూడసాగాడు. అప్పటికన్న అందంగా పొంకంగా వుంది. ఎంత బాగా నటిస్తోందో. ఆమెని చూడాలనీ కలుసుకోవాలనీ అతనికి ఆవేశం కలిగింది.

ఆ రాత్రి ఇంటికి వొచ్చి ఆమెని గురించే ఆలోచిస్తూ పడుకున్నాడు. జీవితం నిజంగా చిత్రమైనదే. ఒక్కొక్క వ్యక్తి పురోగమనంలో ఎన్ని మలుపులు.

వీటన్నిటి మధ్యా ఏదో రాయాలన్న ఆరాటం దానికి స్వరూపం ఇవ్వలేని అస్పష్టత. అతన్ని వేధించసాగాయి.

ఒకప్పుడు ఎంత తేలిగ్గా. సునాయాసంగా రాసేవాడు, ఆలోచన కూడా శ్రమ అనిపించేది కాదు. కొంత పేరు వస్తున్న తరుణంలో ఇంచుమించు రాయటం మానుకున్నాడు. తనని రచయితగా క్రమేపీ అంతా మరచిపోతారేమో. అతనికి భయం వేసింది.

మరునాడు ప్రొద్దున్న ఇంటికి వచ్చిన వారపత్రిక తిరగేస్తోంటే అందులో ఓ ప్రకటన కనబడింది. నవలల పోటీయట. ఉత్సాహంగా వివరాలన్నీ చదివాడు. అతనికి ఉద్రేకం కలిగింది, రాయాలి. రాయాలి.

సామాజిక ఇతివృత్తం తీసుకోవాలిట.

అనుకోకుండా ఆ మధ్యాహ్నము అతను రాయటం మొదలు పెట్టాడు. అంతా ఊహాగానమే, ఓ మధ్య తరగతి కుటుంబాన్ని తీసుకున్నాడు. తండ్రీ, తల్లీ, కొడుకులూ, కూతుళ్ళూ వాళ్ళ ప్రత్యేక స్వభావాలు.

అతని కలం సాగిపోతోంది.

ఓ పదిరోజుల్లో సగం నవల తయారయింది. మొదట గజిబిజిగా, ఏమిటోగా వున్న భావాలకు ఇప్పుడో ఆకృతి ఏర్పడింది. పాత్రలను విశిష్టంగా మలచగలుగుతున్నాడు. లోపలకు ప్రవేశం దొరికినకొద్దీ, పరిధిని విశాలం చేసుకుంటూ, స్వేచ్ఛగా తడుములాట లేకుండా రాసుకు పోసాగాడు. తనకు తెలియని సంగతులు కూడా అందులోకి దొర్లుకు రాసాగాయి.

ఓ రోజు ఉదయం మధుబాబుని వెతుక్కుంటూ ఓ పెద్ద మనిషివాళ్ళ ఇంటికి వొచ్చాడు. ఆయన్ని అంతవరకూ ఎప్పుడూ చూడలేదు. అందుచేత తెల్లబోయి, ఆయన్ని కూర్చోబెట్టి ప్రశ్నార్ధకంగా చూశాడు.

ఆయన తనకి తాను పరిచయం చేసుకున్నాడు. ఈ మధ్య హైదరాబాద్ నుంచి ప్రచురితమౌతున్న కొత్త వారపత్రిక సంపాదకులలో ఒకరు. పనిమీద ఈ ఊరువచ్చి మధుబాబు ఇక్కడ వున్నాడని తెలుసుకుని చూడడానికి వచ్చాడుట. ఆ పత్రిక గురించి మధుబాబుకు తెలుసు, కొత్తగా స్థాపిత మయినా వృద్ధిలోకి వస్తోంది. ఫీచర్స్ బాగుంటున్నాయి.

"మంచి సీరియల్ ఏమయినా ప్రారంభించాలని వుందండీ, త్వరగాకూడా మొదలెట్టాలి. కాని మంచి నవల వున్నట్లుండి యెలా పుట్టుకు వస్తుంది? మీరు నవలలేమయినా రాసారా?" అనడిగాడు సంపాదకుడు.

అసలు పత్రిక తాలుకు సంపాదకుడు తనని గురించి తెలుసుకుని రావటమే గొప్పగా వుంది మధుబాబుకు. ఈ ప్రశ్న మరీ ఉత్సాహం రేకెత్తించింది.

"ఒకటి రాస్తున్నానండి. ఇంకా పేరు పెట్టలేదు. సగం వరకూ పూర్తయింది" అన్నాడు.

"ఏదో పట్రండి చూద్దాం" అన్నాడాయన ఆతృతగా.

ఎందుచేతో మధుబాబు రచనలంటే ఆయనకి గురి వున్నట్లుంది. అతను తెచ్చిన పుస్తకం విప్పి చూస్తూండగానే ముఖం వికసించింది. "ఇది మేము ప్రచురిస్తామండీ" అన్నాడు పదినిమిషాలు పరిశీలించాక తల యెత్తి.

మధుబాబు దిగ్భ్రాంతుడై "ఇంకా పూర్తికాలేదండి" అన్నాడు.

"ఫర్వాలేదు. మీరు పూర్తిచేస్తూండండి. ఈలోగా మేము ఎడ్వర్‌టైజ్ చేస్తూ వుంటాము. రేపటిలోగా నవల టైటిల్‌కూడా ఆలోచించి వుంచండి."

మధుబాబు సంతోషంతో ఉక్కిరి బిక్కిరి అయినా అతని మనసింకా, ఆ ప్రముఖ వారపత్రిక నడిపిస్తూన్న పోటీమీద కొంచెం వుంది.

"అసలు యిది నేను పోటీకని మొదలుపెట్టానండి" అన్నాడు కొంచెం జంకుతూ.

కాని సంపాదకుడు మాంచి ఉత్సాహం మీద ఉన్నాడు. "అబ్బే మీరింకా అలా అనకండి. ఇది మేమే ప్రచురించాలి. పోటీలో యిచ్చే బహుమతి కన్నా యెక్కువే యిస్తాం సరేనా?" అన్నాడు బలవంతం చేస్తూ.

మధుబాబు తల ఊపాడు.

తను మరునాడు మళ్ళీ వస్తాననీ, యీ స్క్రిప్టు తీసుకువెళ్ళి ఇవాళంతా చదువుతానని. మరునాటికి నవలపేరు ఆలోచించి ఉంచమనీ చెప్పి ఆయన వెళ్ళిపోయాడు.

మధుబాబుకి క్రమంగా ఉద్రేకం చల్లారి సంకోచం పట్టుకుంది. ఒకవేళ ఆ సంపాదకుడు తొందరపాటుతో తనమీద అంత నమ్మకం వుంచాడేమో? తాను తూగుతాడో? తూగడో?

సాయంత్రం ఈ సంగతి ఉమాపతికి చెప్పాడు.

ఉమాపతి వ్యవహారం దగ్గర నిక్కచ్చిగా వుండే మనిషి.

"డబ్బు ఎంత ఇస్తాడో ఖచ్చితంగా తేల్చుకున్నారా? అది ముఖ్యం. మొహమాట పడబోకండి" అన్నాడు.

మధుబాబుకు ఈ సలహా నచ్చలేదు. మనిషికి మనిషికీ మధ్య మృదుపూర్వకమైన సంబంధ బాంధవ్యాలు వుండాలిగాని వ్యవహార పక్షంగా వుండకూడదని అతని ఉద్దేశం. మౌనంగా ఊరుకున్నాడు.

మరుసటి వారం ఆ హైదరాబాద్ వీక్లీలో రాబోతున్న మధుబాబు నవలని గురించి పెద్ద ఎత్తున ప్రకటన పడింది. తెలుగు సారస్వతంలో విశిష్ట స్థానాన్ని పొందగల నవల అని భరోసా యిస్తున్నారు సంపాదకులు.

అతనికి సిగ్గువేసింది. తనని వీళ్ళు యెక్కడికో ఈడ్చుకు పోతున్నారు. అసలు యీ నవల్లో తాను అనుకుని చేసిన గట్టి ప్రయత్నమేమీలేదు. అంత గొప్పతనం ఏమీలేదనికూడా నమ్మకం. ఈ విషయం వెల్లడి అయాక పత్రికాధిపతులూ, పాఠకులు కూడా తనని తిట్టుకుంటారు.

అతనికి భయం వెయ్యసాగింది.

అతని కలం ఇప్పుడు వణుకుతోంది. అట్లానే మరి పదిహేను రోజులు శ్రద్ధగా కూర్చుని నవల పూర్తి అయిందనిపించి పోస్టు చేసేసి "హమ్మయ్య" అని నిట్టూర్చాడు.

కొద్దిరోజుల్లో అసలు సంపాదకుడి దగ్గర్నుంచి అతనికో లేఖ వచ్చింది. సీరియల్ మరో రెండుమూడు వారాల్లో ఆరంభించనున్నారట. తమకి యెంతో నచ్చిందట, అభినందిస్తూ ఉజ్వలమైన భవిష్యత్ కాంక్షిస్తూ రాశాడు.

"అంతా పిచ్చివాళ్ళే" అనుకున్నాడు మధుబాబు నిట్టూర్చి.

## 14

సెలవులు గడిచి మళ్ళీ విశాఖపట్నం వచ్చేశాడు. మళ్ళీ యీ శాసనాలు, నిబంధనలూ, నిర్బంధ జీవితం.

కాని వారం వారం అతనికి గొప్ప ఊరట కలుగుతోంది. సీరియల్‌గా వస్తోన్న నవలని చదువుకుంటూ వుండటంవల్ల. మొదటివారం అతని ఫోటోతో బాటూ అతన్ని గురించి పొగుడ్తూ కొంత రాశారు. అలాంటి రచయిత తెలుగులో ఉన్నందుకు గర్వించాలి అని ఆల్టిమేటమ్. అతడు లజ్జితుడైనాడు.

మొదటి వారం ప్రచురితమైన రెండు అధ్యాలూ చదువుకోగానే అతనికి చప్పగా వున్నట్లనిపించింది. తాను అనుకున్న వాతవరణం బలీయమైన సృష్టి కనబడలేదు. నిరాశ, విరక్తి కలిగాయి. కాని ఒకరోజు ఆగి మళ్ళీ చదువుకోగానే బాగున్నట్లే అనిపించింది. కొత్త సొబగులు గోచరించ సాగాయి.

ఇది మొదటి ప్రయత్నం. ఎలావుందో యెవరినైనా అడుగుదామని మహా ఉబలాటపడ్డాడు. కాని నోరు విడిచి యెవరినడిగినా ఏమయినా అనుకుని పోతారేమో. బాగా లేదంటే? ఊరుకున్నాడు.

కాని ఒక్క మెడికల్ కాలేజి విద్యార్ధులేకాదు, యూనివర్సిటీలో మిగతా విద్యార్థులుకూడా ఆ సీరియల్‌ని ఆసక్తితో చదవసాగారు. మధు బాబు అక్కడి స్టూడెంటేనని అందరికీ తెలిసిపోయింది. అతని ఫోటో కూడా ప్రచురించబట్టి యితనే అని తేలిగ్గా గుర్తుపట్టసాగారు కూడా.

నాలుగయిదు వారాలు గడిచేసరికి అతని నవల బాగా ప్రచారంలోకి వచ్చింది. ఆ పత్రిక అమ్మకం కూడా విపరీతంగా పెరిగింది. అతని నవల పండితులూ, పామరులూ అంతా చదవసాగారు. కొతమంది విద్యార్థులు ప్రత్యక్షంగా వచ్చి అభినందించసాగారు.

ఈలోగా విజయవాడనుంచి ఓ పబ్లిషర్ అతని కథలు ఓ సంపుటంగా వేస్తానని ఉత్తరం రాశాడు. అతని కథల కటింగ్స్ అన్నీ పదిలంగా అతని దగ్గరే వున్నాయి. వాటిని పంపించేసి ఈ విషయం ఉమాపతికి తెలియబరిచాడు, ఉమాపతి జవాబు రాస్తూ టరమ్స్ ఖచ్చితంగా మట్లాడుకొమ్మని సలహా ఇచ్చాడు.

మొదట ఇన్ని వారాలు ప్రచురితమవుతుందని అనుకోలేదు మధుబాబు తన నవలగురించి. మూడునెలలు గడిచేసరికి దాదాపు సగం పూర్తయింది. అతనికి ఆశ్చర్యమనిపించింది. ఇంత పెద్ద నవల, ఇన్ని సమస్యలతో, ఇన్ని పాత్రలతో, అంత స్వల్పవ్యవధిలో తాను ఎలా వ్రాయగలిగాడు? అతనికి నమ్మబుద్ధి కావటంలేదు.

మొత్తానికి ఆరునెలలు గడిచేసరికి అతని నవల ప్రచురణ పూర్తయింది. ఏదో పోగొట్టుకున్నట్లు దిగులు కలిగింది అతనికి. వెలితిగా ఉంది.

ఈ వెలితిని తీరుస్తూ అతనికి లేఖలు శరపరంపరలుగా రాసాగినై. అతనికి విచిత్రంగా వుంది. తెలుగుదేశంలో రచయితలకు ఇలా ఉత్తరాలు రాసేవాళ్ళున్నారని అతనిప్పుడు ప్రత్యక్షంగా తెలుసుకుంటున్నాడు. తన నవల అంతగా కదిపిందా ప్రజలని? తనలో ఏముంది? తనకసలు ఏం తెలుసునని?

అతనికి రాసినవాళ్ళలో విద్యార్థులూ, విద్యార్థినులూ, డాక్టర్లూ, ప్లీడర్లు, వివిధ మనస్తత్వంగలవాళ్ళు అందరూ వున్నారు. ఒక్కొక్కరూ ఒక్కొక్క కోణంలో రాసేవారు. ఇవన్నీ ఇవతలవుంచి మూడు నాలుగు ఉత్తరాలు అతన్ని కదిపివేశాయి.

"..నా జీవితం గురించే రాశారనుకుంటున్నాను. అనురాధ పాత్రనాదే. ఎంత పరిశీలన మీది? చదువుతున్నంతసేపూ ఏడుస్తూనే వున్నాను – అభాగిని" అని ఒక ఉత్తరం.

"అటా యిటా అన్న సందిగ్ధంలో సతమతమవుతూన్న నాకు మీ నవల చక్కని పర్యవసానం చూపించింది. అన్నయ్యా, అవును. మీరు నాకు అన్నయ్యే? లేకపోతే ఇంత మంచి సలహా ఎందుకు యిస్తారు? అపరిచిత"

ఇట్లా వున్నాయి ఉత్తరాలు.

తను ఇంట్లో కూర్చుని రాసినవి ఒక్కొక్కరి జీవితానికి యింత సన్నిహితంగా సంభవిస్తున్నవా? ఇది తన అదృష్టమా? ఏమిటో వైపరీత్యం?"

అతని కన్నుల్లో నీళ్ళు నిలిచాయి.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments